
సాక్షి
ఒడిశా
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 2.70.501
బంగారం	4 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
వెండి	59 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ట్రాక్‌పై కొండరాళ్లు

గత రెండు రోజులుగా విపరీతంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొరాపుట్–రాయగడ(కేఆర్) రైల్వేలైన్‌లోని టికిరి–రౌళి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం కొండరాళ్లు జారిపడ్డాయి. ట్రాక్‌కు అడ్డంగా చెట్టుకొమ్మలు పడిపోయాయి.

- 8లో

బంగాళాఖాతంలో అల్పపీడనం



వాయుగుండం ప్రభావంతో మధ్య బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో అల్పపీడనం క్రమంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం.

- 8లో

న్యూస్‌రీల్

విస్తారంగా వర్షాలు

పర్లాకిమిడి: బంగాళాఖాతంలో అల్పపీడనం వలన గత రెండు రోజులుగా గజపతి జిల్లాలో పర్లాకిమిడి, నువాగడ, రాయఘడ, కాశీనగర్ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గుసాని సమితిలో రామసాగరం, గజపతి, కృష్ణసాగరాలు వరద నీటితో కళకళలాడుతున్నాయి. గజపతి, కృష్ణసాగరం, బట్టిసిరిపురం మహేంద్రతనయ ఆయకట్టు నుంచి ఇటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు అందుతుంది. పంట పొలాలు వర్షాలతో పచ్చదనంతో తొనకిసలాడుతున్నాయి. జిల్లాలో బుధవారం వర్షపాతం వివరాలు పరిశీలిస్తే...

కాశీనగర్ సమితి	7 మి.మీ
పర్లాకిమిడి	44.2 మి.మీ
రాయఘడ సమితి	41 మి.మీ
నువాగడ	42.2 మి.మీ
ఆర్.ఉదయగిరి	24.3 మి.మీ
మోహనా	52.2 మి.మీ
గుసాని	8.0 మి.మీ

కొండచిలువ పట్టివేత



పట్టుబడిన కొండచిలువ

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్‌ఏసీ 8వ వార్డు దుర్గగుడి వీధిలో నివాసముంటున్న టిటు శేఠి ఇంటి పెరటులోకి బుధవారం ఉదయం కొండచిలువ ప్రవేశించింది. దీంతో ఆయన కేకలు వేయగా కర్రలు మధ్యకు వెళ్లిపోయింది. అప్పటికే అది ఆరాత్రి నాలుగు కోళ్లను తినేసింది. దీంతో బలిమెల స్నేక్ హెల్ప్‌లైన్ సెంటర్‌కు తెలియజేయగా రాజేంద్రఖోర అనే వ్యక్తి వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. పట్టుబడిన కొండచిలువ 7 అడుగుల పొడవు ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు వలన కొండచిలువ అడవి నుంచి వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. దీనిని అటవీశాఖ వారికి అప్పగించి వారి సాయంతో చిత్రకొండ ఘాటీ అడవిలో వదిలేశారు.

నదిలో మునిగి చిన్నారి మృతి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కొడిపారి పంచాయతీ కుటురాగుడ గ్రామానికి చెందిన బాసంతి మాఝి కుమారుడు వైకుంఠ మాఝి(5) దంగిడిసలి నదిలో మునిగి మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఒండ్రాకంచ్ పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. బాసంతి తన కుమారుడితో కొడిపారి గ్రామానికి ఏదో పనిమీద వచ్చింది. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో సమీపంలోని నదిలో తల్లీకొడుకులు స్నానం చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నదీ ప్రవాహం ఎక్కువవ్వడంతో నదిలోకి స్నానంకోసం దిగిన వైకుంఠ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. దీంతో తల్లి కేకలు వేసి దగ్గరలో ఉన్నవారిని పిలిచింది. అక్కడ ఉన్నవారు వచ్చి వెతికినా ప్ర యోజనం లేకపోవడంతో ఒండ్రాకంచ్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి రాత్రి బాలుని మృతదేహన్ని కనుగొన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎక్సైజ్ పోలీసులు రెండు వేర్వేరు చోట్ల బుధవారం తనిఖీలు నిర్వహించి 75 కేజీలు గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి సమితి కోయిలిపల్లి గ్రామం వద్ద ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అతివేగంగా వస్తున్న కారును తనిఖీ చేయగా దానిలో 50 కేజీల గంజాయి పట్టుబడడంతో, కారులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తులు ఘురాం రామ్, దేవేంద్ర సింగ్, రాకేష్ సోనిగా వెల్లడించారు. వీరంతా ఛత్తీష్‌గాడ్ రాష్ట్రం రాయిపూర్ నుంచి వచ్చి గంజాయిను తరలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బలిమెలలో సైతం బుధవారం మధ్యాహ్నం అపనలమాల గ్రామం వద్ద బైక్‌పై 25 కేజీల గంజాయి తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారు నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ పోలీసుస్టేషన్ పరిధి ప్రతాప్‌బాగామి, కొరపుట్ జిల్లాకు చెందిన ఇంద్రజిత్ బిసాయిలుగా తేలింది. ఈ ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.

జలమయం



బరంపురం: ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్న రూశికుల్యా నదిలో వరద నీరు

పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గంజాం, కొందమాల్, రాయగడ జిల్లాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై నీలనిల్వ అవ్వడంతో వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఓడ్రాఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: సాయి ఇంటర్నేషనల్ రోడ్డులో విరిగిపడిన చెట్టు



బరంపురం: గంజాం జిల్లాలో నీట మునిగిన వరినాట్లు



బరంపురం: వరద నీటిలో చిక్కుకున్న కటింగయా ఆదివాసీ గ్రామం



పర్లాకిమిడి: నిండుకుండలా రామసాగరం



బరంపురం: నెహ్రూ నగర్‌లో వరద నీరు



రాయగడ: జంఝావతి నదిలో పెరిగిన నీటి ప్రవాహం



మల్కన్‌గిరి: వంతెనపై ప్రవహిస్తున్న ఐదడుగుల వరద నీరు



బరంపురం: బగ్గువ నది దగ్గర భద్రతగా ఉన్న పోలీసు అధికారులు



బరంపురం: నగరంలో కురుస్తున్న కుండపోత వర్షం



బరంపురం: కొందమాల్‌లో వరద బాధితులను రక్షించడానికి వెళ్తున్న ఓడ్రాఫ్ బృందం

విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ పక్కనే ఇతర నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లోని సర్కిల్ టౌస్‌లో బీజేపీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశా రాష్ట్ర అభివృద్ధిపై దేశ ప్రధాని నరేంద్రమోదీ దృష్టి సారించారని తెలియజేశారు. స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రంజన్ పొలాయి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేడీని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత 23 ఏళ్లుగా నవీన్ పాలనలో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బరంపురం లోక్‌సభ నుంచి నరేంద్రమోదీ పోటీ చేయనున్నారా అనే ప్రశ్నకు బదులుగా పార్టీ హైకమాండ్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో గంజాం, కొందమాల్ జిల్లాలకి చెందిన బీజేపీ నాయకులతో పాటు గంజాం జిల్లా అధ్యక్షుడు భిభుతి జెన్నా తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష నగదు చోరీ

రాయగడ: నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరు కాంట్రాక్టర్ల నుంచి రూ.లక్ష నగదు చోరీకి గురైన ఘటన జిల్లాలోని గుణుపూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పంచాయతీలోని జంగ్‌జంగ్ గ్రామానికి చెందిన మార్గిశర్ గొమాంగో, తామా గొమాంగో అనే ఇద్దరు కాంట్రాక్టర్లు, గుణుపూర్‌లోని ఒక బ్యాంకులో మంగళవారం మధ్యాహ్నం రూ.లక్ష విత్ డ్రా చేశారు. అయితే కొద్దిదూరం వెళ్లాక బైకు మొరాయించడంతో తామా గొమాంగో బండి తోస్తుండగా, మార్గిశర గొమాంగొ ఒక సంచిలో డబ్బు పట్టుకొని నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇద్దరు బైకుపై వచ్చి చేతిలోని సంచిని లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితులు గుణుపూర్ ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమేరాల ద్వారా నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



తుంబా అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు



చికిటి పెంటలో స్వాధీనం చేసుకున్న సామగ్రి



తుంబాలో స్వాధీనం చేసుకున్న సామగ్రి

బరంపురం: నగర శివారులో అక్రమంగా నడుస్తున్న రెండు వేర్వేరు సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 3,600 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఎస్పీ సార్వణ్ వివేక్ మరియు ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలు మేరకు... జరడా పోలీసుస్టేషన్ పరిధి ఆంధ్రా–ఒడిశా సరిహద్దు తుంబా అటవీ ప్రాంతం శివారులో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. అదేవిధంగా కె.నువాగాం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై సైతం దాడులు చేపట్టారు. జరిగిన రెండు వేర్వేరు దాడుల్లో 3,600 లీటర్ల నాటుసార ధ్వంసంచేసి నష్టపరిచారు. మరో 180 లీటర్ల సార మరియు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు.

జూదం అడ్డాలపై నిఘా పెట్టండి



మాట్లాడుతూన్న ఎస్పీ జగ్‌మోహన్ మీనా

- గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా ఆదేశం

బరంపురం: ఈనెల 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో జూదం అడ్డాలపై అధికారులు నిఘా పెట్టాలని గంజాం ఎస్పీ జగమోహన్ మీనా ఆదేశించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని ఎస్పీ కార్యాలయంలో వివిధ స్టేషన్ల ఐఐసీ అధికారులు, ఎస్‌డీపీవోలు, డీఎస్పీలు, ఏఎస్పీలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరాత్రి పూజల పేరిట బలవంతంగా చందాలు వసూలు చేసినవారిపై కేసులు నమోదుచేసి జైలుకి తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా జూదం అడ్డాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వినాయక చవితి మరియు దసరా నవరాత్రి ఉత్సవాల పండాల కోసం కలెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే పూజ పండల ప్రాంగణలో ఎటువంటి అగ్ని ప్రమాదం జరిగే కార్యక్రమాలు చేయరాదని, పూజా మండపాల్లో ప్రత్యేక విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి కమర్షియల్ బిల్లుల చార్జీలు వసులు చేయడం జరుగుతుందని చెప్పారు. విగ్రహాల నిమజ్జనాలను కలెక్టర్ ఇచ్చిన రూట్ మ్యాప్ ప్రకారం చేయాలని కోరారు. సమావేశంలో గంజాం పోలీసు మండలికి చెందిన అన్ని పోలీసుస్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై దృష్టి

- అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగర్గ్



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై కలెక్టర్లు దృష్టి సారించాలని రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ మరియు అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్ సూచించారు. స్థానిక ఖారవేళ భవన్‌లో కలెక్టర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో అమలవుతున్న వివిధ పథకాలు మరియు కార్యక్రమాల స్థితిగతులపై సమీక్షించారు. సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి వాటి అమలును వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ లక్ష్యాల సాధనకు జిల్లాలు జట్టుగా పనిచేయాలని ప్రత్యేకంగా సూచించారు. ఎస్ఎస్ఈపీడీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ వృద్ధాప్య పింఛన్ సక్రమంగా అందేలా చూడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మో ఘురొ పథకం మరియు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పీఎంఏవై (జీ) స్థితిని ఈ సదస్సులో సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్రిక్ అండ్ మార్టర్ బ్యాంకింగ్ ఔటులెట్ల ఏర్పాటు వివరాలను ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి ముంగిట బ్యాంకింగ్ సేవలను కల్పించడం ధ్యేయంగా పేర్కొన్నారు.


55 ఆమె బస్టాండ్‌లు ఏర్పాటు

వాణిజ్యం మరియు రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లొకేషన్ యాక్సెస్ మల్టీ మోడల్ ఇనిసియేటివ్ పథకం అమలును వివరించారు. తొలిదశలో ఇప్పటివరకు 55 ఆమె బస్టాండ్‌లు (ఏబీఎస్) ఏర్పాటు చేయగా, మరో 124 పైప్‌లైన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బస్టాండ్ల నిర్వహణ మరియు సాధారణ పనితీరు అంశాలను ఆయా ప్రాంతాల జిల్లా కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా వివిధ విభాగాలతో కలిసి జిల్లా స్థాయి ఇంటెన్సివ్ స్కిల్లింగ్‌పై వివరణాత్మకంగా చర్చించారు. వ్యవసాయం మరియు రైతుల సాధికారత విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ, పంట వాతావరణ పరిస్థితి మరియు రబీ సీజన్‌కు సంబంధించిన ఆకస్మిక ప్రణాళికతో పాటు ఒడిశా మిల్లెట్ మిషన్ కార్యకలాపాలపై ప్రజెంటేషన్ చేశారు. విద్యుత్ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి, కమిషనర్ కమ్ సెక్రటరీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ, పాఠశాలలు మరియు సామూహిక విద్యా విభాగం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ఏడబ్ల్యూసీలు, పాఠశాలలకు వేగంగా విద్యుద్దీకరణ పూర్తిచేసి సత్వర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. మైనింగ్ ప్రభావిత జిల్లాల్లో ప్రాథమిక సౌకర్యాలు మరియు జీవనోపాధి కార్యకలాపాలను ప్రోత్సాహానికి జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) మరియు ఓఎంబీఏడీసీ నిధుల వినియోగంపై వివరణాత్మక చర్చ జరిగింది.

క్లుప్తంగా

స్క్రబ్ టైఫస్‌తో ఐదుగురు మృతి

● కొత్తగా 4 కేసులు నమోదు



భువనేశ్వర్: స్క్రబ్ టైఫస్ వ్యాధితో బర్‌గడ్ జిల్లాలో 5 మంది మరణించారు. వీరిలో సొహేలా మండలంలో ఇద్దరు మృతి చెందగా, అట్టాబిరా, బొరొపాలి, భేడెన్ మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున స్క్రబ్ టైఫస్ బారినపడి మృతి చెందినట్లు అదనపు జిల్లా ప్రజారోగ్య అధికారి (ఏడీపీహెచ్‌ఓ) సాధు చరణ్ దాష్ తెలిపారు. ఈ వారంలో మరో నాలుగు కొత్త కేసులు నమోదైనట్లు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలు, పంట పొలాల్లో పనిచేసేవారిలో లేదా అటవీ ఉత్పత్తులను సేకరించడానికి అడవులకు వెళ్లేవారిలో ఈ బ్యాక్టీరియా వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో జిల్లాలోని రైతు వర్గాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం

భువనేశ్వర్: త్వరలో జరగనున్న ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన రాష్ట్ర అథ్లెట్లకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రతిష్టాత్మకమైన ఈ క్రీడా పోటీల్లో మెలకువలపై వీరికి శిక్షణ, సన్నద్ధత మరియు భాగస్వామ్యానికి మద్దతుగా ఒక్కో క్రీడాకారునికి రూ.10 లక్షలు చొప్పున సాయం ప్రకటించారు. ఆసియా ఖండంలో ప్రతిభావంతులైన అథ్లెట్లను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఆసియా క్రీడలు ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ పోటీలు అథ్లెట్ల అంకితభావం మరియు ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికను కల్పిస్తాయని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ 23వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు చైనాలోని హాంగ్‌జౌలో జరగనున్న ఆసియా క్రీడలకు ఒడిశా నుంచి 13 మంది అథ్లెట్లు అర్హత సాధించారు. వారికి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, రాష్ట్ర క్రీడాకారులు ఈ క్రీడల్లో తమ ప్రతిభను కనబర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

జాజ్‌పూర్ వైద్య కళాశాలకు జజాతి కేశరి పేరు



జాజ్‌పూర్ జజాతి కేశరి వైద్య కళాశాల ఆస్పత్రి సముదాయం

భువనేశ్వర్: జాజ్‌పూర్ వైద్య కళాశాల మరియు ఆస్పత్రికి జజాతి కేశరి పేరు పెట్టే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదం తెలిపారు. జాజ్‌పూర్ ప్రజల కోరిక మేరకు ఈ వైద్య కళాశాలకు జజాతి కేశరి పేరు పెట్టాలని నిర్ణయించడం విశేషం. జాజ్‌పూర్‌లో ఈ ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ఆస్పత్రి 2024 సంవత్సరం నుంచి వినియోగంలోకి వస్తుంది. జాజ్‌పూర్‌లోని జజాతి కేశరి వైద్య కళాశాల మరియు ఆస్పత్రి క్యాంపస్ 46 ఎకరాల విస్తీర్ణంలో రూ.526.21 కోట్లతో నిర్మించబడింది. ఈ కాలేజీలో కొత్త విద్యా సంవత్సరం 2024-25 నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరంలో 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ)తో సంప్రదింపులు చేస్తుంది. త్వరలో ఈ మేరకు అనుమతి పత్రం (లెటర్ ఆఫ్ పర్మిషన్ - ఎల్‌ఓపీ) జారీ అవుతుందని ఆశిస్తున్నారు.

ఘనంగా మహా లింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాసశివరాత్రి మహా పర్వ శివ పంచాయతన సహిత మహా లింగార్చన బుధవారం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆదాయం రూ.5.69 లక్షలు

పాతపట్నం: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.5,69,372 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 60 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఆలయ హుండీని బుధవారం ఉదయం లెక్కించామని చెప్పారు. శ్రీకాకుళం సహాయ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు జి.వి.బి.ఎస్ రవి కుమార్ పర్యవేక్షించగా.. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నేతాజీ, కృష్ణారావు, నాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్‌పై కొండరాళ్లు

● ఆలస్యంగా నడిచిన రైళ్లు



ట్రాక్‌పై జారిపడిన బండరాళ్లు



ట్రాక్ మధ్యలో విరిగిపడిన మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

రాయగడ:

గత రెండు రోజులుగా విపరీతంగా కురుస్తున్న వర్షాల కారణంగా కొరాపుట్-రాయగడ(కేఆర్) రైల్వేలైన్‌లోని టికిరి-రౌళి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం కొండరాళ్లు జారిపడ్డాయి. ట్రాక్‌కు అడ్డంగా చెట్టుకొమ్మలు పడిపోయాయి. అదేవిధంగా కొండ వాగుల్లోని వరద నీరు ట్రాక్‌పైకి వచ్చింది. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బండరాళ్లను తొలగించారు. అదేవిధంగా ట్రాక్‌కు అడ్డంగా పడిన మొక్కలను నరికి ట్రాక్‌ను క్లియర్ చేశారు. దీంతో ఈ మార్గంలో కొరాపుట్ నుంచి రాయగడ, రాయగడ నుంచి కొరాపుట్‌లకు వెళ్లే డీఎంయూ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. అదేవిధంగా జగదల్‌పూర్ నుంచి హౌడా వెళ్లే సమలేశ్వరీ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా నడిచింది. ట్రాక్ బాగా దెబ్బతినడంతో ట్రైన్‌లు కేవలం 30 కిలోమీటర్ల వేగంతో మాత్రమే నడిచాయి. ప్రతీసారి వర్షాకాలంలో ఇటువంటి తరహా సమస్యలు ఈ లైన్‌లో చోటుచేసుకుంటున్నాయి. అయితే ఎటువంటి ప్రాణ నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ట్రాక్‌పై వర్షపు నీరు



బండరాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

బంగాళాఖాతంలో అల్పపీడనం

● పలు జిల్లాలకు భారీ వర్షాలు

భువనేశ్వర్: వాయుగుండం ప్రభావంతో మధ్య బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో అల్పపీడనం క్రమంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సమాచారం. దీంతో రానున్న మూడు రోజుల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలు మరియు దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా అల్పపీడనం కదలిక ఉంటుంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ బుధవారం ముందస్తు సమాచారం జారీ చేసింది. ఇదిలా ఉండగా ప్రాంతీయ వాతావరణ కేంద్రం బుధవారం రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎరుపు, నారింజ మరియు పసుపు హెచ్చరికలను జారీ చేసింది.

రెడ్ అలెర్ట్


కటక్, దెంకనాల్, అంగుల్, నయాగఢ్, బౌద్ధ్, సోన్‌పూర్, కంధమల్ మరియు గంజాం జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ (7 సెంటీ మీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల వరకు) వర్షపాతం సంభవించే అవకాశం ఉంది.

ఆరెంజ్ అలెర్ట్

జాజ్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, ఖుర్దా, పూరీ, గజపతి, రాయగడ, నవరంగ్‌పూర్, కలహండి, నువాపడా, బొలంగీర్, బర్‌గడ్ మరియు సంబల్‌పూర్ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (7 సెంటీ మీటర్ల నుండి 20 సెంటీ మీటర్ల వరకు) కురిసే అవకాశం ఉంది.

ఎల్లో హెచ్చరిక

కొరాపుట్, సుందర్‌గఢ్, ఝార్సుగుడ, దేవ్‌గఢ్, కెంజొహర్, భద్రక్ మరియు కేంద్రాపడా జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షపాతం (7 సెంటీ మీటర్ల నుంచి 11 సెంటీమీటర్ల వరకు) కురిసే అవకాశం ఉంది.



రాష్ట్రంలో అల్పపీడన ప్రభావ ప్రాంతాల ఉపగ్రహ చిత్రం

వారంలోగా అపరాధ రుసుం కట్టిస్తాం



సెబ్ జేడీ విజయ నాగ మణికంఠ

శ్రీకాకుళం క్రైమ్ : వివిధ మద్యం కేసుల్లో పట్టుబడి చార్జిషీటు ఫైల్ కానివాటికి (కాంపౌండింగ్ కేసులు) మరో వారం రోజుల్లో అపరాధ రుసుం కట్టిస్తామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ జేడీ విజయ నాగమణికంఠ బుధవారం తెలిపారు. 550 మంది ఇప్పటి వరకు అంగీకార పత్రాలు (అప్రూవల్) సమర్పించారని, ఇంకా కట్టేందుకు సిద్ధంగా ఉన్నవారి కోసం మరో వారం రోజులు వేచి చూసి అప్రూవల్ తీసుకుని ఫీజులు కట్టిస్తామన్నారు. పట్టుబడిన మద్యం సీసాలను బట్టీ బ్యాంకులో చలానాలు తీసుకుని సెబ్ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

కరువు ప్రాంతాల్లో పర్యటన



కర్తలి వద్ద ఎండిపోయిన వరి నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కంచిలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది కంచిలి మండలంలో ఇంతవరకు ఉభాలు కాని గ్రామాలను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కె.శ్రీధర్ బుధవారం పరిశీలించారు. మండలంలో కనీస స్థాయిలో కూడా వర్షపాతం నమోదు కాకపోవడంతో ఇంతవరకు చాలా గ్రామాల్లో ఉభాలు పడలేదు. వాస్తవానికి 5500 ఎకరాలు వరకు ఉభాలు జరగాల్సి ఉండగా, వర్షాభావ పరిస్థితులతో 2,364 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ వివరించారు. కేవలం వర్షాధారంతోనే పంటలు సాగుచేయడం జరుగుతోందని కర్తలి, మఠం సరియాపల్లి, దాలేశ్వరం, రాగుపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తామని జేడీ తెలిపారు. ప్రతి రైతు తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, సోంపేట ఏడీఏలు భవానీశంకర్, జగన్మోహనరావు, వ్యవసాయ సహాయకులు విద్యాసాగర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఎన్ఎంయూకు గుర్తింపుపై హర్షం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అతిపెద్ద యూనియన్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషకరమని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శిమ్మయ్య అన్నారు. ఆర్టీసీ ఎన్ఎంయూకు గుర్తింపు వచ్చిన సందర్భంగా రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ఎన్ఎంయూ కార్యాలయంలో శ్రీకాకుళం 1, 2 డిపోల ఎన్ఎంయూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిమ్మయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల అభివృద్ధి, శ్రేయస్సుకు ఎన్నో ఏళ్లుగా ఎన్ఎంయూ కృషి చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.కె.రావు, కార్యదర్శి వై.అప్పయ్య, 2డిపో కార్యదర్శి వి.శాంతరాజు, 1వ డిపో అధ్యక్షుడు కె.నర్సింహులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఆర్.ఎస్.పట్నాయక్, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎంయూ రాష్ట్ర కార్యదర్శి వై.అప్పయ్య

నివాళి



సూర్య నారాయణ పాత్రో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ గణేషీ లాల్

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్, మంత్రి సూర్య నారాయణ పాత్రో చిత్రపటానికి గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ బుధవారం భువనేశ్వర్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత నాయకుడి నివాసంలో ఏర్పాటు చేసిన ద్వాదశ కర్మ కార్యక్రమానికి గవర్నర్‌తో కలిసి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాజరయ్యారు. సూర్యనారాయణ పాత్రోకు ముఖ్యమంత్రి సైతం నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఒడిశా శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు.



నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

బాడీ బిల్డింగ్‌లో రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభ



అమిత్ భుంయ్యాను అభినందిస్తున్న మంత్రి ప్రమీల మల్లిక్



జగన్నాథ్ ఖుంటియాకు శుభాకాంక్షలు తెలుపుతున్న వినీల్ కృష్ణ

● అమిత్ భుంయ్యాకు స్వర్ణం
● జగన్నాథ్ ఖుంటియాకు కాంస్య పతకం

భువనేశ్వర్: ఖాట్మండ్‌లో జరిగిన 55వ ఆసియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు సత్తాచాటారు. అమిత్ భుంయ్యా 70 కిలోల విభాగంలో స్వర్ణం, 75 కిలోల వర్గంలో జగన్నాథ్ ఖుంటియా కాంస్య పతకాన్ని సాధించారు. అమిత్ భుంయ్యా స్వర్ణ పతకం సాధించడం మన ప్రాంతానికే గర్వకారణమని బింఝార్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ - విపత్తు నిర్వహణ విభాగం మంత్రి ప్రమీలా మల్లిక్ ఆనందం వ్యక్తం చేశారు. బింఝార్‌పూర్ ముద్దు బిడ్డ అమిత్ భుంయ్యా అని కొనియాడారు. స్వర్ణ పతక విజేతగా స్వగ్రామానికి తిరిగి వచ్చిన భుంయ్యాను ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. ఖాట్మండ్ నుంచి వచ్చిన క్రీడాకారులు అమిత్ భుంయ్యా, జగన్నాథ్ ఖుంటియాలు రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల విభాగం కార్యదర్శి ఆర్.వినీల్ కృష్ణను కలిశారు. మరిన్ని విజయాలతో వీరివురు ఈ రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పాముకాటుతో ఆటోడ్రైవర్ మృతి

మందస: మండలంలోని జిల్లుండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుగ్గల భీమారావు(49) పాము కాటుకు గురై మరణించాడు. మంగళవారం రాత్రి ఇంటిలో పడుకున్న భీమారావు కాలుపై ఏదో కరిచినట్టు అనిపించడంతో గాయంపై పసుపు రాసి మళ్లీ పడుకున్నాడు. వేకువజామున విషం పాకడంతో ఊపిరి తీసుకోవడానికి కష్టమవుతున్న తరుణంలో కుటుంబసభ్యులు హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. 108 అంబులెన్స్‌లో భీమారావును టెక్కలి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మరణించాడు. భీమారావుకు భార్య హేమలత, కుమారుడు ఆకాశ్, కుమార్తె మౌనిక ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన భీమారావు మృతితో కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఈయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా సేవలందించారు. సర్పంచ్ చింతాడ శ్రీకావ్య, పార్టీ సీనియర్ నాయకుడు శిస్టు బాపూజీ, సచివాలయం కన్వీనర్ డొక్కరి పాపారావు, పార్టీ నాయకులు భీమారావు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

సమైక్యతా వారధి హిందీ

● నేటి నుంచి హిందీ పక్షోత్సవాలు
● జిల్లాలో హిందీ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహణ



నరసన్నపేట: సుందరాపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో హిందీ 'అ' ఆకృతిలో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో జాతీయ సమైక్యతకు హిందీ భాష ఎంతగానో దోహదపడుతోంది. ఉత్తర, దక్షిణ భారత దేశాల వారధిగా కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ భాషగా, కేంద్ర ప్రభుత్వ భాష (రాజభాష)గా భిన్న భాషల మధ్య అనుసంధానకర్తగా విశేష సేవలు అందిస్తోంది. భిన్న భాషల భారతావనిలో జాతీయ భాష ఉండాలని తలచిన జాతీయ నేతలు గాంధీజీ, కావేల్కర్, తిలక్ తదితరులు హిందీని జాతీయ భాషగా చేయాలని దేశవ్యాప్తంగా ఉద్యమించి సఫలీకృతులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1925 నుంచి హిందీ భాష ప్రచారం ఊపందుకుంది. హిందీ ప్రచార సభ హైదరాబాద్, దక్షిణ భారత హిందీ ప్రచార సభల ద్వారా హిందీ భాషా ప్రచారం జోరుగా సాగుతోంది.

జిల్లాలో హిందీ ప్రచారం..

జిల్లాలో మొదటిగా పుణుగుపాటి జోగారావు బృందావనం మాస్టారు, బెహరా ఉమామహేశ్వరరావు, పెంట లక్ష్మణశర్మ, ఎస్.బాలకృష్ణమూర్తి తదితరులు హిందీ భాష ప్రచారానికి కృషి చేశారు. ప్రస్తుత తరంలో మండపల్లి రామకృష్ణారావు, కోనే శ్రీధర్ తదితరులు హిందీ ప్రచారానికి కృషి చేస్తున్నారు. పాలకొండకు చెందిన డాక్టర్ సి.ఎల్.నాయుడు జిల్లాకు తొలిసారిగా హిందీ టీచర్ ట్రయినింగ్ కాలేజీని తీసుకువచ్చారు. కోనే శ్రీధర్ జిల్లాలో 'హిందీ దివస్' ఉత్సవం ప్రారంభించారు. 1992 నుంచి నేటికీ కొనసాగిస్తున్నారు. హిందీకి తగిన ప్రోత్సాహం అందించాలని, ఎల్పీసెట్ ద్వారా హిందీ పండిత శిక్షణ ప్రవేశాలను తక్షణమే పునరుద్ధరించాలని, సెకండరీ స్థాయి వరకు త్రిభాషా సూత్రాన్ని పటిష్టంగా అమలు పరచాలని, ఎలిమెంటరీ స్థాయి నుంచి హిందీ భాష బోధన ప్రవేశపెట్టాలని, అదనపు హిందీ పండిట్ పోస్టులు మంజూరు చేయాలని శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్షోత్సవాలు ఇలా..

ఈ నెల 14న శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్(ఎన్‌సీఎస్)లో హిందీ దివస్ పక్షోత్సవాలు ప్రారంభమవుతాయి. విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలిమహంతి జగన్మోహనరావులు పాల్గొంటారు. ఈ నెల 16న ఎంపీపీ స్కూల్ కల్లేపల్లి (శ్రీకాకుళం రూరల్ మండలం)లో, 19న జెడ్పీ హైస్కూల్ బెజ్జిపురం (లావేరు మండలం)లో, 20న జెడ్పీ హైస్కూల్ అక్కులపేట (ఆమదాలవలస మండలం)లో, 22న బలగలోని ఆదిత్య విద్యా నిలయంలో హిందీ దివస్ కార్యక్రమాలు జరుగుతాయి. ముగింపు కార్యక్రమం ఈ నెల 28న విశాఖపట్నంలో నిర్వహించేలా హిందీ మంచ్ చర్యలు తీసుకుంది.

భాషాభివృద్ధికి చర్యలు..



హిందీ ప్రచారసభ హైదరాబాద్‌ఆధ్వర్యంలో హిందీ విశారద, భూషన్, విద్వాన్ తదితర పరీక్షలు జరిపిస్తున్నాం. దక్షిణభారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– దొంతం పార్వతీశం,
జిల్లా అధ్యక్షుడు, హిందీ మంచ్


విజయవంతం చేయాలి..



ఏటా హిందీ మంచ్ ఆధ్వర్యంలో హిందీ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది కూడా ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో 14 నుంచి 28వ తేదీ వరకు హిందీ వేడుకలను జరిపిస్తున్నాం. వీటిని విజయవంతం చేయాలి.

– రొంపివలస రామారావు,
జిల్లా ప్రధాన కార్యదర్శి

హిందీతో జాతీయత



హిందీ భాషాభివృద్ధిలో భాగంగా సెప్టెంబరు 14 నుంచి 28 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. హిందీ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– కోనె శ్రీధర్,
హిందీ మంచ్ ఉత్తరాంధ్ర సమన్వయకర్త

ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి



ప్రతి ఒక్కరూ హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలి. ఉత్తర భారతదేశం వెళ్లాలన్నా, అక్కడ స్థిరపడాలన్నా హిందీ భాష రాకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హిందీ మంచ్ ప్రచారం అభినందనీయం.

– వి.కొండలరావు,
ఎన్‌బీటీ క్లబ్ సభ్యుడు, పొందూరు

క్లుప్తంగా

నాక్‌కు సన్నద్ధం కావాలి

● సెంచూరియన్ వైస్‌ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డీఎన్‌రావు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం నాక్‌కు సన్నద్ధం కావాలని వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాక్ నిబంధనల మేరకు బోధన పద్ధతులను అవలంబించాలని సూచించారు. యూజీసీ గుర్తింపు పొందిన మ్యాగజైన్లలో వ్యాసాలు ప్రచురితమయ్యే విధంగా కృషి చేయాలని చెప్పారు. సీఎస్‌ఆర్ కార్యక్రమాలను ఎక్కువగా చేపట్టాలని, పేటెంట్స్ పొందడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు ఎస్వీ రమణారావు, సన్నీడియోల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌డే

పార్వతీపురం: ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు వ్యక్తిగత ఫిర్యాదులతో సహా ఏరకమైన ఫిర్యాదులైనా సమర్పించవచ్చునని, ఫిర్యాదులను జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో ప్రత్యేక ఐడీలతో నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఆయుష్మాన్ భవ పోస్టర్ విడుదల

పార్వతీపురం: ఆయుష్మాన్ భవ పోస్టర్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ బుధవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్‌భవ పక్షోత్సవాలు ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ఆరోగ్యకరమైన భారత్-సామర్థ్యం గల భారత్ అనే నినాదంతో చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందరికీ ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేస్తారని, ప్రతివారం ఆరోగ్యమేళాను గ్రామాల్లో గల వెల్‌నెస్ కేంద్రాల్లోను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోను, వైద్య కళాశాలల్లోను వైద్య ఆరోగ్య నిపుణులతో ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారన్నారు. అక్టోబర్ 2నుంచి గ్రామాల్లో, పట్టణాల్లో వార్డుల వారీగా శానిటేషన్, న్యూట్రిషన్ కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరాలపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గ్రామస్థాయి నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి బి.వాగ్దేవి, ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్ తదితరులున్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం ● ఏడుగురికి గాయాలు



గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మెంటాడ (గజపతినగరం రూరల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు గాయపడ్డారు. వారిలో బొద్దల సుగుణ, సోమిరెడ్డి కన్నం నాయుడులు తీవ్రంగా గాయపడడంతో సుగుణను విశాఖలోని కేజీహెచ్‌కు, కన్నం నాయుడిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. కూరగాయలు అమ్ముకునేందుకు దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామం నుంచి ఆటోలో గజపతినగరం వచ్చిన వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

వీరఘట్టం: ఆహార కల్తీకి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన వీరఘట్టం మండల కేంద్రంలోని పలు కిరాణా షాపుల్లో తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన సరుకులు విక్రయించాలని సూచించారు.ఎవరైనా కల్తీ వస్తువులు విక్రయిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కొన్ని షాపుల్లో శాంపిల్స్ తీశారు. అలాగే హోటళ్లలో రుచికరమైన టిఫిన్,భోజనాలు విక్రయించాలని,నిల్వ ఉంచిన పదార్థాలను విక్రయించకూడదని హితవు పలికారు.

విద్యార్థుల క్రీడా సందడి

● స్కూల్‌గేమ్స్ పోటీల నిర్వహణకు కార్యాచరణ
● ఈనెల 14, 15 తేదీల్లో కార్పొరేషన్ పరిధిలో పాఠశాలల విద్యార్థులకు
● 16న మండల పరిధి పాఠశాలల విద్యార్థులకు పోటీలు
● 20న నియోజకవర్గ స్థాయి పోటీలు



క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విజయనగరం: పాఠశాల విద్యార్థుల క్రీడా సందడి ప్రారంభమైంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలకు సంబంధించి విజయనగరం నియోజకవర్గ స్థాయిలో తేదీలు ఖరారయ్యాయి. అండర్-14,17 వయస్సుల విభాగాల్లో ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. మొత్తం 9 క్రీడాంశాల్లో నిర్వహించే ఎంపిక పోటీల్లో భాగంగా నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు విజయనగరం కార్పొరేషన్‌పరిధిలో గల విద్యార్థులకు పోటీలు నిర్వహించనుండగా..16న మండల పరిధిలో గల పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఈనెల 20న నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ ప్రకటించి..అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

రాజీవ్ క్రీడామైదానం వేదికగా..

పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ క్రీడామైదానం వేదికగా స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 8.30 గంటలలోగా ఆయా క్రీడాంశాల్లో పోటీ పడే అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుంది. నియోజకవర్గం పరిధిలో పట్టణ పరిధి ఎక్కువగా ఉండడంతో ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 14న వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. 15న ఖోఖో, త్రోబాల్,టెన్నికాయిట్, యోగా క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. అలాగే 16న మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు అన్ని క్రీడాంశాల్లో ఒకే రోజు పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

పోటీలను విజయవంతం చేయాలి

ప్రతి ఏడాది పాఠశాల విద్యార్థులకు నిర్వహించే స్కూల్ గేమ్స్ క్రీడాపోటీల నిర్వహణకు సమయం ఆసన్నమైంది. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 20వ తేదీలోగా మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిల్లో 9 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్ని కాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నాం. నియోజకవర్గం పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను నిరూపించుకోవచ్చు.

సంజీవరావు, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, విజయనగరం

నేడు జాతీయభాష దినోత్సవం



నేడు హిందీ దివస్

రాజాం: వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, విభిన్నమైన నాగరికతలకు నెలవు భారతదేశం. దేశంలోని ప్రతి రాష్ట్రానికి ఒక ప్రాంతీయ భాష ఉంది. అంతేకాదు ఒకే రాష్ట్రంలో కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళ్తే అక్కడివారి భాష మరోలా ఉంటుంది. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేందుకు ఒక భాష అవసరం. అటువంటిదే జాతీయ భాష హిందీ. అన్ని రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను ఏకంచేసి, రాజభాషగా ముద్రవేసుకున్న జాతీయభాషకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. సెప్టెంబర్ 14వ తేదీకి హిందీ దివస్‌ను దేశం మొత్తం జరుపుకోంటుంది. హిందీ భాషా దినోత్సం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, డిబేట్లు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు. ఈ ఏడాది వారం రోజులపాటు జాతీయ భాష దినోత్సవాలను నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న ఆదరణ..

రెండు తెలుగు రాష్ట్రాల్లో హిందీ అధ్యయనం కోసం ఎన్నో భాషా ప్రచార సంస్థలు వివిధరకాల కోర్సులు అందిస్తున్నాయి. ఎంతోమంది విద్యార్థులను హిందీ భాషలో ప్రావీణ్యులుగా తీర్చిదిద్ది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. పదోతరగతిలో హిందీ సబ్జెక్ట్‌లో ఎక్కువ మార్కులు వచ్చినవారికి డిఫెన్స్ ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయి.



కె.మధుసూదనరావు

హిందీ భాషాభివృద్ధిలో ప్రచారక్‌లు..

హిందీభాషాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రచారక్‌లు ఎనలేని సేవలు అందిస్తున్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒకరి నుంచి ముగ్గురు వరకూ ప్రచారక్‌లు వివిధ సంస్థల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ప్రాథమిక స్థాయి నుంచి ప్రవీణ వరకూ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఎంతో మంది హిందీ భాషోపాధ్యాయులను, విద్వాంసులుగా తీర్చిదిద్దుతున్నారు. నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చుతున్నారు.

16 ఏళ్ల నుంచి ప్రచారక్‌గా

నాకు ప్రభుత్వ ఉద్యోగం రాకముందునుంచే హిందీ ప్రచారక్‌గా వ్యవహరిస్తున్నాను. నేను ప్రతి ఏడాదీ హిందీ పండిట్‌గా పనిచేస్తున్న పాఠశాల ద్వారా హిందీ ప్రచార సభ ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. పది తరువాత కళాశాలకు వెళ్లి చదవలేని విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు పూర్తిచేస్తూ ఉద్యోగాలు పొందుతున్నారు. గత 16 ఏళ్లుగా హిందీ ప్రచార సభలు నిర్వహిస్తున్నాను.

కె.మధుసూదనరావు, హిందీ ప్రచారక్, రాజాం

చేపతో దోమకు చెక్..!



విజయనగరంలోని ఫోర్ట్‌సిటీ స్కూల్ వద్ద ఉన్న చెరువులో గంబుషియా ఫిష్ వదులుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీఎంఓ మణి

● గంబూషియాతో మలేరియా దూరం
● చర్యలు చేపట్టిన వైద్యాధికారులు

విజయనగరం ఫోర్ట్: ప్రజలను పట్టిపీడిస్తున్న మలేరియా వ్యాధికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు మలేరియా వ్యాధికి కారణమయ్యే దోమలు వృద్ధి చెందకుండా మొగ్గలోనే తుంచేయాలని నిర్ణయించి ఆ దిశగా చర్యలు చేపట్టింది.

చెరువుల్లో గంబుషియా ఫిష్

మలేరియా వ్యాధికి గంబూషియా ఫిష్‌తో చెక్ పెట్టనున్నారు. నీరు పారే ప్రాంతాల్లోను, నీరు నిల్వ ఉన్న చోట ఈఫిష్‌ను వదులుతారు. మలేరియా కలగజేసే అనాఫిలిస్ దోమలకు చెందిన లార్వాలను గంబూషియా ఫిష్ తినేస్తుంది. తద్వారా దోమల వృద్ధి ఆగిపోతుంది. ఫలితంగా వ్యాధి వ్యాప్తి తగ్గిపోతుంది.

జిల్లాలో 2.56 లక్షల ఫిష్

జిల్లాలోని పలు గ్రామాల్లో గల చెరువుల్లో గంబూషియా ఫిష్‌ను వైద్యాధికారులు వదిలిపెట్టనున్నారు. ఈ మేరకు 956 గ్రామాల్లో 2.56 లక్షల గంబూషియా ఫిష్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



బొబ్బిలి మండలంలోని చెరువులో గంబూషియా ఫిష్ వదులుతున్న వైద్యసిబ్బంది

ప్రతిశుక్రవారం డ్రైడే పాటించాలి

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని చెబుతున్నాం. దోమలు పెరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు వెక్టర్ కంట్రోల్‌ఐజిన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఎక్కడైతే చెత్తాచెదారం పేరుకుపోయినట్లు కనిపిస్తుందో అప్రాంతాన్ని ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తాం. అది సంబంధిత పంచాయతీ సెక్రటరీకి పంపిస్తాం. వెంటనే నివారణ చర్యలు తీసుకుంటాం. ఈఏడాది మలేరియాను కలగజేసే దోమలను నివారించేందుకు గంబూషియా ఫిష్‌ను నీరు నిల్వ ఉన్న, నీరు పారే ప్రాంతాల్లో వదులుతున్నాం.

డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి హ్యాక్‌థాన్

● జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య



సత్కారం పొందుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని కళాశాల స్థాయిలో పంచుకోవడానికి హ్యాక్‌థాన్ సదస్సులు దోహదపడుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌క్యుబేషన్ సెంటర్ సంయుక్తంగా 'హ్యాక్‌థాన్ 2కె23 ఇన్నోఎక్స్‌పో 360' పేరుతో మూడురోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఎప్పటికప్పుడు వస్తున్న పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి ఇలాంటి సదస్సులను కళాశాలలు నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిశోధనా దృక్పథాన్ని మెరుగు పరచుకోవడానికి విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, కో-ఆర్డినేటర్, ఐవీ విభాగాధిపతి డాక్టర్ బి.తిరుమలరావు, ట్రిబుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పద్మజ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ నోరిసీ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సి.నీలిమాదేవి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి



శిథిలావస్థకు చేరిన అడారుగెడ్డ కాజ్‌వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

● అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు
● బాగుజోల నుంచి సిరివర వరకు రూ.11కోట్ల ఖర్చుతో రోడ్డు నిర్మాణం
● డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: గత నాలుగేళ్లుగా గిరిజన గ్రామాలు ప్రగతి పథంలో పయనించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషే కారణమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గిరిజన గ్రామాల ప్రజల రాకపోకలకు వీలుగా కోట్లాది రూపాయల ఖర్చుతో బ్రిడ్జిలు, రోడ్లు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. మక్కు వ మండలం దుగ్గేరు గ్రామ సమీపంలో అడారుగెడ్డపై శిథిలావస్థకు చేరుకున్న కాజ్‌వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.6 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. మక్కువ, సాలూరు మండలాల్లోని గిరిశిఖర గ్రామాలైన బాగుజోల నుంచి సిరివర వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించంగా రూ.11 కోట్లు మంజూరైనట్టు వెల్లడించారు. పనులు త్వరగా ప్రారంభించాలని పీఆర్ డీఈ శర్మకు సూచించారు. గతంలో టీడీపీ నాయ కులు అడారుగెడ్డపై మోకాళ్లలోతులో దిగి ఫొటోలుకు ఫోజులిచ్చారే తప్ప నిధులు మాత్రం మంజూరుచేయలేకపోయారన్నారు. వర్షాకాలంలో ఆడారుగెడ్డ ఉగ్రరూపం దాల్చుతుండడంతో తరచూ గిరిజన ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, దీనిని గుర్తించి బ్రిడ్జి నిర్మాణానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అడారుగెడ్డపై బ్రిడ్జి నిర్మాణ విషయాన్ని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడులు తెలియజేయగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. మక్కువ, సాలూరు మండలాల్లోని గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనుల కల కొద్దిరోజుల్లో సాకారమవుతుందని తెలిపారు.

15న జేఎన్‌టీయూ కూడలిలో హెల్త్‌గ్రీవెన్స్ కౌంటర్

విజయనగరం అర్బన్: వైద్య పరమైన సహాయం, సీఎం సహాయ నిధి కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడానికి జేఎన్‌టీయూ కూడలి సమీపంలోని హెలిప్యాడ్ బయట కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజు (ఈ నెల 15న) తమ ఆరోగ్యపరమైన వినతులను ప్రత్యే కౌంటర్ వద్ద అందజేయాలని సూచించారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ అందజేయనున్న అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి పోటీలు నిర్వహించి అవార్డులను ప్రదానం చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఔత్సాహికులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ .టూరిజం.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. ఎంపిక చేసిన వారికి పర్యాటక దినోత్సవం సందర్భంగా అవార్డులు అందించడం జరుగుతుందని ఆయన వివరించారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు



రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

● కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కోసం సెప్టెంబర్ 23 తేదీ నాటికి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమం, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు కేటాయించిన 3,170 వీవీపీఏటీఎస్‌కు 2,170 అందాయని తెలిపారు. బెంగళూరు బీఈఎల్ నుంచి వచ్చిన వీవీపీఏటీఎస్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో స్వీకరించామన్నారు. కొత్త ఈవీఎం మిషన్ల స్కానింగ్ సెప్టెంబర్ 14, 15 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 20 తేదీ నుంచి ఈవీఎంలను పరీక్షిస్తామని, సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ సహకరించాలని కోరారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈవీఎమ్‌లు, వీవీపీఏటీఎస్ మొదటి స్థాయి తనిఖీ (ఎఫ్‌ఎల్‌సీ) జరుగుతుందని తెలిపారు. పాచిపెంట మండలం తుమ్మరపల్లి పంచాయతీ నూరువరహాలపాడు గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి 9 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉన్నందున కొండమోసూరు గ్రామంలో కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పాచిపెంట మండలం కేరంగి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారన్నారు. కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనుకూలతలపై నివేదిక అందజేయాలని ఎన్నికల అధికారులకు సూచించారు. జిల్లాలో తొలగించిన ప్రతి ఓటు క్షుణ్ణంగా పరిశీలన జరుగుతోందని తెలిపారు. జిల్లాలో అన్ని రకాల ఫారాలకు సంబంధించిన దరఖాస్తులు 1,07,533 అందగా అందులో పాలకొండ నియోజకవర్గానివి 37,386, కురుపాం- 30,738, పార్వతీపురం-16387, సాలూరు నియోజకవర్గానికి సంబంధించినవి 23,022 ఉన్నట్టు వెల్లడించారు. వీటిలో 1445 తిరస్కరించగా, 3,115 అంగీకరించామని, 64,365 మంది పేర్లను ఓటరు జాబితాలో చేర్చామని, 38,608 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు వివరించారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పారిశర్ల అప్పారావు, టి.వెంకటరమణ, కె.పాపారావు, కె.మన్మథరావు, పి.రాజశేఖర్, జె.భాస్కరరావు, బి.డి.చంద్రమౌళి, పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల కొరతకు సర్దుబాటు

● బోధనకు ఆటంకం లేకుండా చర్యలు



బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి పలు సంస్కరణలు అమలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం, బైజూస్‌తో వర్చువల్ బోధన, విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత, సీబీఎస్‌ఈ సిలబస్ అమలు, డిజిటల్ బోధన తదితర నూతన పద్ధతులను అమలు చేస్తున్నారు. తాజాగా విద్యార్థుల బోధనకు ఆటంకం లేకుండా టీచర్ల కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 359 మంది వివిధ కేటగిరి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు. వారిలో ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు, లాంగ్వేజ్ పండిట్లు ప్రధానంగా ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలను తొలుత గుర్తించి జిల్లా కమిటీ ఆమోదం తెలియజేయడంతో సర్దుబాటుకు మార్గం లభ్యమైంది. . ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవై బదిలీ చేసిన పాఠశాలల్లో వెంటనే చేరాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,789 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 2 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలలకు బదిలీ చేశారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లు బోధిస్తే పై తరగతుల్లో విద్యార్థులు సులువుగా రాణించగలుగుతారని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీంతో కొన్ని పాఠశాలల్లో సెకంటరీ గ్రేడ్ టీచర్ల కొరత ఏర్పడింది. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో మిగులు ఉపాధ్యాయుల నుంచి కొరతకు సరిపడే సంఖ్యలో మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది.



తరగతి గదిలో విద్యార్థులు

359 మంది టీచర్ల సర్దుబాటు

ప్రభుత్వ పాఠశాలల్లో మిగులు ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశాలలకు బదిలీ చేసే విధంగా కసరత్తు చేశారు. జూలై నెలాఖరు నాటి విద్యార్థుల నమోదు నిష్పత్తి ఆధారంగా ఉపాధ్యాయుల కొరతను లెక్కకట్టారు. దాని ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 359 మంది టీచర్ల కొరత ఉన్నట్లు గుర్తించారు. సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులలో ఎస్‌జీటీ కేటగిరిలో 54 మంది, మిగిలిన వారిలో సబ్జెక్టు టీచర్లు బయాలజీ-56, ఆంగ్లం-50, హిందీ-19, గణితం-53, భౌతికశాస్త్రం-32, సాంఘిక శాస్త్రం-84, తెలుగు11 ఉన్నాయి. సర్దుబాటు చేసిన వారిలో దాదాపు అన్ని సబ్జెక్టుల టీచర్లు ఉన్నారు.

వెంటనే విధుల్లో చేరాలి

సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి వెంటనే రిలీవ్ అయి కొత్త పాఠశాలల్లో చేరాలని డీఈఓ ఆదేశించారు. విద్యార్థులకు బోధనలో ఇబ్బందులు లేకుండా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.